## క్లుప్తంగా

### నేడు మల్లన్న జాతర


ముస్తాబైన మల్లికార్జునస్వామి ఆలయం

**తాండూరు రూరల్:** మండల పరిధిలోని గౌతపూర్‌లో శ్రీ మల్లికార్జునస్వామి జాతర ఆదివారం నిర్వహించనున్నట్లు పూజారి చంద్రయ్య స్వామి తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం స్వామివారి ఊరేగింపు, సాయంత్రం బోనాలు నిర్వహిస్తామన్నారు. జాతర సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

### ఘనంగా ధనుర్మాస పూజలు


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

**కొడంగల్ :** పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలిసిన పద్మావతి సమేత శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలను భక్తులు ఘనంగా చేశారు. శనివారం ఉదయం స్వామివారి ఆలయంలో తిరుప్పావై పారాయణం ధరూర్ శ్రీనివాసాచార్యులు ప్రవచనం వినిపించారు. అలాగే ఉ.9 గంటలకు స్వామివారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ధర్మకర్తలు, అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

### బహిరంగ వేలం


విక్రయించిన టైర్లు

**అనంతగిరి:** జిల్లా పోలీసులు వాడిన వాహనాలకు సంబంధించిన కాలపరిమితి అయిపోయిన విడిభాగాలకు శనివారం ఎస్పీ కోటిరెడ్డి ఆధ్వర్యంలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేశం, ఆర్‌ఐలు సూరప్పనాయుడు, అంజత్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

### సముచిత స్థానం కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న శివ

**అనంతగిరి:** అన్ని రంగాల్లో మాదిగలకు సముచిత స్థానం కల్పించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ అన్నారు. శనివారం వికారాబాద్‌లో జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ బిల్లుపై సుప్రీంకోర్టు ధర్మాసనం జనవరి 17న తుది తీర్పు ఇవ్వనుందన్నారు. చిరకాల స్వప్నం ఫలించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీలను సంస్థాగతంగా నిర్మాణం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆనంద్, మల్లికార్జున్, మల్కప్ప, సుభాష్, అంజి, స్వామిదాసు, నర్సింలు, మహేందర్, రాజేందర్, రాములు, గోపి, రాజు, కృష్ణ , పరుశురాం, ప్రసాద్, రాజు తదితరులు ఉన్నారు.

### రాజన్న పాలన గుర్తుకొస్తుంది..


పెద్దేముల్ : అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు, నాయకులు

**పెద్దేముల్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకం తీసుకున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని చూస్తుంటే దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి పాలన గుర్తుకొస్తోందని పెద్దేముల్ మండల హన్మాపూర్ ఎంపీటీసీ సభ్యులు లొంకనీళు , గొట్లపల్లి సర్పంచ్ విజయమ్మ అన్నారు. శనివారం పెద్దేముల్ మండల గొట్లపల్లి హన్మాపూర్, కొండాపూర్, రెగోండితో పాటు పలు గ్రామాలల్లో ప్రజాపాలన నిర్వహించారు. గొట్లపల్లి గ్రామంలో ఎంపీటీసీ, సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందజేస్తున్న గ్యారంటీ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ లక్ష్మప్ప, ఏఓ నజీరోద్దిన్, ఆర్‌ఐ రాజీరెడ్డి, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. రుక్మాపూర్ గ్రామంలో జరుగుతున్న ప్రజాపాలన కార్యక్రమానికి మండల స్పెషల్ అధికారి లలిత కుమారి, జెడ్పీటీసీ ధారాసింగ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# ప్రజల చెంతకే పాలన

**ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి**


పూడూరు: దరఖాస్తులు తీసుకుంటున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

**పూడూరు:** ప్రజాపాలన ద్వారా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తామని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని కంకల్, మీర్జాపూర్, తదితర గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చి హామీ ప్రకారం వందరోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. గ్రామాల్లో ఉండే ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజాపాలన కార్యక్రమం అధికారులు బాధ్యాతాయుతంగా నిర్వహించాలన్నారు. రేషన్‌కార్డులు లేనివారికి కొత్తరేషన్ కార్డులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం గ్యారంటీల దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, సర్పంచ్ సంతోష, మండల ప్రత్యేక అధికారి సుధారాణి, రఘునాథ్‌రెడ్డి, సురేందర్, సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

**బొంరాస్‌పేట, దుద్యాలమండలాల్లో 1,254 దరఖాస్తులు**

**బొంరాస్‌పేట:** గ్రామాల వారీగా నేటి నుంచి ప్రజాపాలన నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధమైంది. ఉమ్మడి మండలంలో తహసీల్దార్ వెంకటేశ్, దుద్యాల తహసీల్దార్ దానయ్య, ఎంపీడీఓ వెంకన్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ రవిలు టీంలీడర్లుగా ఉంటూ దరఖాస్తుల స్వీకరించారు. చెట్టుపల్లి తండా 184, సత్తర్‌కుంటతండా98, నాగిరెడ్డిపల్లి 228, లోతికుంట తండా68, మదన్‌పల్లితండా248, మదన్‌పల్లి151, బాపన్‌చెర్వుతండా176, మూడు మామిళ్లతండా101 దరఖాస్తులు అందగా మొత్తం 1,254 దరఖాస్తులు వచ్చాయని అధికారులు చెప్పారు. జనవరి 2న దుద్యాల మండలం ఈర్లపల్లి, సత్తర్‌కుంటతండా, బొంరాస్‌పేట మండలంలోని లింగన్‌పల్లి, బొట్లోనితండా, మహంతీపూర్, దుప్‌చర్లలో గ్రామసభలు, దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని అధికారులు తెలిపారు.

**గ్యారంటీలను సద్వినియోగం చేసుకోవాలి**

**తాండూరు రూరల్:** ప్రతి ఒక్కరూ గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవాలని గౌతపూర్ సర్పంచు రాజప్పగౌడ్ అన్నారు. శనివారం గ్రామస్తులకు దరఖాస్తులను ఆయన స్వయంగా పూర్తి చేసి ఇచ్చారు. అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**యాలాలలో..**

**యాలాల:** ప్రజాపాలన కార్యక్రమం మూడో రోజు కొనసాగుతుంది. మండలంలోని బండమీదిపల్లి, రేళ్లగడ్డతండా, పగిడిపల్లి గ్రామాల్లో అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జనవరి 6న మిగతా గ్రామాల ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని అధికారులు తెలిపారు.

**అందరికీ అందేలా చేస్తాం**

**కుల్కచర్ల :** ఆరు గ్యారంటీలు ప్రజలందరికీ అందుతాయని ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి అన్నారు. శనివారం కుల్కచర్ల మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి ప్రభుత్వం గ్యారంటీలను తీసుకువచ్చిందన్నారు. ప్రత్యేక చర్యలు తీసుకుంటూ నేరుగా ప్రజల నుంచే దరఖాస్తులను స్వీకరిస్తుందన్నారు. దరఖాస్తులు ఇవ్వని వారు జనవరి ఆరోవ తేదీ వరకు ఇవ్వడానికి సమయం ఉందని, ఆ తర్వాత కూడా ఈ దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోందని వివరించారు. ఎవరూ ఆందోళన చెందాల్సి అవసరం లేదని చెప్పారు. కార్యక్రమంలో డీపీఓ తరుణ్‌కుమార్, సర్పంచ్ శిరిష, ఎంపీటీసీ జ్యోతి శ్రీనివాస్, డీసీసీబీ మాజీ చైర్మన్ భీంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు పాల్గొన్నారు.

**పేదల సంక్షేమం కోసమే..**

**మర్పల్లి:** పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కల్‌ఖోడ, పెద్దాపూర్ గ్రామాల్లో తహసీల్దార్ గణేశ్ తమ టీం బృందంతో కలిసి 'అభయహస్తం ప్రజాపాలన' సర్పంచ్ శివకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం కొనసాగిస్తుందని, మరో 5 గ్యారంటీ పథకాలకు అధికారులు గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మాధవరెడ్డి, ఏఈఓ నీరజ, ఏపీఎం మధుకర్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాచన్న, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రామేశ్వర్, జిల్లా, మండల నాయకులు ఖలీమోద్దీన్, దివాకర్, శేఖర్, పాండు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

**బంట్వారంలో..**

**బంట్వారం:** అర్హులందరికీ ఆరు గ్యారంటీ పథకాలు అందుతాయని ఎంపీపీ ప్రభాకర్ అన్నారు. శనివారం మండలంలోని సుల్తాన్‌పూర్ ,బొప్పునారంలో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు ప్రజల నుంచి ధరఖాస్తులు స్వీకరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. అర్హులందరూ గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సుల్తాన్‌పూర్ , బొప్పునారం సర్పంచ్‌లు బర్కత్‌పల్లి నర్సింలు ,కల్పన ,తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ ,ఎంపీఓ విజయ్‌కుమార్ సూపరింటెండెంట్ షిండే, ఆర్‌ఐలు తులసీరామ్ ,విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**తప్పులు దొర్లకుండా చూడాలి**

**ధారూరు:** దరఖాస్తు ఫారాల్లో తప్పులు ఉంటే సరిచేయాల్సిన బాధ్యత అధికారులదేనని ఎంపీపీ జె. విజయలక్ష్మి అన్నారు. శనివారం ఆమె మండల పరిధిలోని ధారూరు, నాగసమందర్, అల్లాపూర్, అవుసుపల్లి గ్రామ పంచాయతీల్లో జరిగిన ప్రజాపాలన గ్రామసభల్లో పాల్గొని ప్రసంగించారు. హెల్ప్ డెస్క్ నిర్వాహకులు ప్రజలు ఇస్తున్న పత్రాల్లో తప్పులు లేకుండా చూడాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. శనివారం 2,262 దరఖాస్తులను ప్రజల నుంచి స్వీకరించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారెడి, తహసీల్దార్ భువనేశ్వర్, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బసప్ప, నాయకులు బాబాకాన్, బస్వరాజ్, మల్లేశ్, బుజ్జయ్యగౌడ్, కిరణ్, సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

**అర్హులందరికీ సంక్షేమ పథకాలు**

**పరిగి:** సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని 8వ ,9వ, 15వ వార్డుల్లో ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 6వ తేదీ వరకు ప్రతివార్డులో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అందుబాటులో లేని వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. తరువాత దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. ప్రతి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి నిజమైన లబ్ధిదారులకు అందజేస్తామని చెప్పారు.

**కొనసాగుతున్న ప్రజాపాలన**

**యాలాల:** ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించనున్నట్లు యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని రేళ్లగడ్డతండా, బండమీదిపల్లి, పగిడిపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తుందన్నారు. సంక్షేమ పథకాల అమలుకు ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులను తీసుకోవాలన్నారు. దరఖాస్తుల విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు వద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పుష్పలీల, ఆర్‌ఐ నారాయణరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నర్సిరెడ్డి, మాజీ అధ్యక్షుడు భీమప్ప, నాయకులు హన్మంతు, మహిపాల్ తదితరులు ఉన్నారు.

**ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి**

**అనంతగిరి:** ప్రజాపాలన కార్యక్రమాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుభాషిణి అన్నారు. శనివారం వికారాబాద్ మండలంలోని గొట్టిముక్ల, పీరంపల్లి, పులుసుమామిడి, పీలారం గ్రామాల్లో ప్రజాపాలనలో భాగంగా అర్హుల నుంచి గ్యారంటీ పథకాల దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..దరఖాస్తులు జనవరి 6వరకు స్వీకరిస్తామని తెలిపారు. ఇప్పటివరకు ఆయా గ్రామాల్లో మొత్తం 3642 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ నాగరాజు, ఆర్‌ఐలు సురేష్, నరేష్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

**సమన్వయంతో పని చేయాలి**

**తాండూరు రూరల్:** ప్రజాప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పని చేసి దరఖాస్తులు స్వీకరించాలని తాండూరు మండల స్పెషలాఫీసర్, ఉద్యానవన శాఖ అధికారి చక్రపాణి అన్నారు. శనివారం మండల పరిధిలోని గౌతపూర్,అంతారం గ్రామాల్లో నిర్వహించిన ప్ర జా పాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ..అభయహస్తం కింద ప్రజలు ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు బయట అమ్మితే చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్ ,ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి, ఎంపీఓ రతన్‌సింగ్ సర్పంచులు రాజప్పగౌడ్, రాములు, ఎంపీటీసీలు నరేందర్‌రెడ్డి, శాంతు, పంచాయతీ కార్యదర్శి ఇస్మాయిలు, సరిత, నాయకులు వడ్డె శ్రీను, జీవరత్నం, ప్రకాష్‌లు ఉన్నారు.


యాలాల: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ పుష్పలీల


మర్పల్లి: తహసీల్దార్ గణేశ్ ఆధ్వర్యంలో..


తాండూరు రూరల్: స్పెషలాఫీసర్, ఉద్యానవన శాఖ అధికారి చక్రపాణి ఆధ్వర్యంలో..


ధారూరు: దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి


బాషీరాబాద్: ప్రజాపాలన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ కరుణ


పరిగి: మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్ ఆధ్వర్యంలో..


కుల్కచర్ల: మాట్లాడుతున్న రామ్మోహన్ రెడ్డి

### దరఖాస్తులు కొనొద్దు

**వికారాబాద్ అర్బన్:** అభయహస్తం గ్యారంటీల దరఖాస్తు పత్రాలను ఆయా వార్డు ఆఫీసర్లు ఇంటింటికి వచ్చి ఇస్తున్నారని ప్రజలు ఎవరు దరఖాస్తు ఫారాలను కొనుగోలు చేయొద్దని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్‌లోని 34 వార్డుల ప్రజలకు సరిపడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. బయట జీరాక్స్ కేంద్రాల్లో అమ్మినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

### రైతులు సభ్యత్వం తీసుకోవాలి

**పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్‌గుప్తా**

**కొడంగల్ రూరల్ :** మండలంలోని రైతులు ప్రాథమిక వ్యవసాయ కోఆపరేటివ్ సొసైటీలో సభ్యత్వం తీసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ కటుకం శివకుమార్‌గుప్తా తెలిపారు. శనివారం పట్టణంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాదార్ పాస్‌బుక్ వివరాల జిరాక్స్‌లతో పాటు రెండు పాస్‌ఫొటోలు, రూ.350 రుసుము చెల్లించాలన్నారు. ఇప్పటివరకు సభ్యత్వం ఉన్న సభ్యులు వారి ఆధార్‌కార్డు, పట్టాదార్ పాస్‌బుక్ వివరాలను సరిచూసుకోవాలని వివరించారు.

### కృష్ణగిరి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


జాతరలో భక్తుల సందడి

**బొంరాస్‌పేట:** నూతన మండలం దుద్యాల శివారులోని కృష్ణగిరిలో వెలిసిన శ్రీ కృష్ణస్వామి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా ఉదయం 6గంటలకు ఆంజనేయస్వామికి సింధూరాభిషేకం, 8గంటలకు వీరాంజనేయస్వామి ఆలయం నుంచి జలకుంభాభిషేకం ఊరేగింపు, పల్లకీసేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. 10.30గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదానం చేశారు. సాయంత్రం 4గంటలకు సత్సంగసభ నిర్వహించి, రాత్రి 8.30 నిమిషాలకు వీరాంజనేయ భజన మండలిచే అడుగుల భజన కార్యక్రమాలు ప్రదర్శించారు.

### ప్రజా సంక్షేమమే లక్ష్యం

**కొడంగల్ రూరల్ :** ప్రజాపాలనను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని గుండ్లకుంట, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలనలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న గ్యారంటీలు అర్హులందరికీ చేరేలా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజాపాలన ప్రత్యేకతను వివరిస్తూ అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ రమేష్, కోఆప్షన్ మెంబర్ మునీర్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నందారం ప్రశాంతు, మురహరి వాసిష్ట తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి


మాట్లాడుతున్న హారతి ద్వారకానాథ్

**అనంతగిరి:** ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు హారతి ద్వారకానాథ్ అన్నారు. ఈ మేరకు శనివారం వికారాబాద్‌లోని శ్రీ సత్యసాయి జ్ఞాన కేంద్రంలో జిల్లా ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షకార్యదర్శుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో విశ్రాంత ఉద్యోగులకు సొంత భవనం లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. త్వరలో స్పీకర్, జిల్లాలోని ఎమ్మెల్యేలను కలిసి సన్మాన సభ ఏర్పాటు చేసి భవనానికి ప్రభుత్వ స్థలాన్ని అడుగుతామన్నారు. అందరం సంఘటితమై మన సమస్యలను సాధించుకుందామన్నారు. అనంతరం సహాధ్యక్షుడు బస్వరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం 1న పింఛన్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు జిల్లా బాధ్యులు, మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

## అదాలత్‌లో 4215 కేసుల పరిష్కారం


కొడంగల్ రూరల్ : కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తి శ్రీరామ్

**తాండూరు టౌన్ :** తాండూరు కోర్టులో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 4215 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ మేరకు తాండూరు కోర్టు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివలీల, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అశోక్ ఆధ్వర్యంలో జరిగిన లోక్ అదాలత్‌లో పలువురు రాజీ కుదుర్చుకున్నారు. పలు కేసుల్లో రూ. 3,53,190 జరిమానా విధించారు.

**రాజీ మార్గమే రాజమార్గ**

**కొడంగల్ రూరల్ :** రాజీ మార్గమే రాజమార్గమని మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి శ్రీరామ్ అన్నారు. పట్టణంలోని మున్సిఫ్‌కోర్టు ఆవరణలో జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో ముఖ్యఅతిథిగా హాజరై కక్షిదారులకు పలు సూచనలు అందజేశారు. పెండింగ్ కేసుల పరిష్కారం కోసం కోర్టులో చాలా సమయం పడుతుందన్నారు.లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం మంచి అవకాశం అని పేర్కొన్నారు. కోర్టు తీర్పు, లోక్ అదాలత్ తీర్పు ఒకటేనని, కేసుల రాజీతో డబ్బు, సమయం వృథా కాకుండా ఉంటుందని తెలిపారు. మెగా లోక్ అదాలత్‌లో పోలీస్ క్యాలెండర్(సీసీ) కేసులు 14, ఎస్‌టీసీ కేసులు 07, ఈ–పెట్టి కేసులు 1050లతో మొత్తం 1071కేసులను పరిష్కరించినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సీఐ రాములు, లోక్ అదాలత్ మెంబర్ బస్వరాజ్, న్యాయవాదులు ఏవీ.ఆనంద్, కరుణాకర్‌రెడ్డి, కృష్ణయ్య, రమేష్, రవీందర్‌నాయక్, కోర్టు సిబ్బంది పకీరప్ప పాల్గొన్నారు.

## జాతీయస్థాయిలో విద్యార్థుల ప్రతిభ

- ఉత్తమ ఎగ్జిబిట్‌గా నిలిచిన మొబైల్ మైక్రోస్కోప్
- ఇస్రో, నాసా ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనకు అనుమతి


ప్రశంసా పత్రం, మెమోంటో అందుకుంటున్న విద్యార్థులు

**తాండూరు టౌన్ :** తాండూరు పట్టణంలోని అక్షర కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు తయారు చేసిన 'మొబైల్ మైక్రోస్కోప్' జాతీయ స్థాయిలో ఉత్తమ ఎగ్జిబిట్‌గా నిలిచింది. ఈ మేరకు మహారాష్ట్రలోని పూణేలో శనివారం జరిగిన 50వ రాష్ట్రీయ బాల్ జ్ఞానిక్ ప్రదర్శనలో ఉత్తమ బహుమతి అందుకొంది. పాఠశాలకు చెందిన విద్యార్థులు సందీప్, అనిరుధ్, వర్ష సూక్ష్మ కణాలను పెద్దదిగా కనపడేలా అరచేతిలో పట్టే మొబైల్ మైక్రోస్కోప్‌ను తయారు చేశారు. ఈ ఎగ్జిబిట్ జిల్లా, రాష్ట్ర, సౌత్‌జోన్ స్థాయిలను దాటి ఏకంగా జాతీయస్థాయికి చేరింది.ఉత్తమ ఎగ్జిబిట్‌గా బహుమతి అందుకోవడంతో పాటు ఈ ఎగ్జిబిట్‌ను ఇస్రో, నాసా, ఐఐఎస్‌ఈఆర్‌లో ప్రదర్శించేందుకు అనుమతి లభించింది. అంతేకాకుండా విహో ఇగ్నైట్ (టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ అవార్డు) అవార్డు జాబితాలో పేరు నమోదు చేసుకుంది. చిన్నతనంలోనే శాస్త్రీయ పరిశోధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ముఖ్యఅతిథులు ఘనంగా సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మోహనకృష్ణ గౌడ్, డైరెక్టర్లు శ్రీకాంత్, ప్రవీణ్, యూనుఫ్, రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు పరిశోధనాత్మక విద్యను అందించడం వల్ల వారిలో శాస్త్రీయ దృక్పథంపై అభిరుచి పెరిగిందన్నారు. ఇందుకు సహకరించిన గైడ్ ఉపాధ్యాయులు సి రవికుమార్, శ్రీకాంత్‌లతో పాటు విద్యార్థులను అభినందిస్తున్నట్లు చెప్పారు.

### భక్తిశ్రద్ధలతో పడిపూజ



**తాండూరు:** తాండూరు పట్టణంలో అయ్యప్ప స్వామి శరణుఘోషతో మార్మోగింది. శనివారం తాండూరు పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బంటు వేణుగోపాల్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకం, పుష్పార్చన , దీపారాధన, మహామంగళహారతి నిర్వహించారు. పూజ కార్యక్రమానికి మాజి కౌన్సిలర్ పట్లోళ్ల నర్సింహులు, నాయకులు హాజరయ్యారు.

## బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలి

**టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు**


సభ్యత్వం నమోదు చేయిస్తున్న సభ్యులు

**పరిగి:** ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు అన్నారు. శనివారం మండలంలోని మిట్టకోడూర్, ఇబ్రహీంపూర్, రంగంపల్లి తదితర పాఠశాలల్లో సంఘం సభ్యత్వం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 317 జీఓ ద్వారా నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గత 9 ఏళ్లుగా పదోన్నతులు లేక ఎన్నో పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 2018 నుంచి ఉపాధ్యాయుల సాధారణ బదిలీలకు నోచుకోలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు వెంటనే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలోమండల అధ్యక్షుడు దశరథ్, ప్రధాన కార్యదర్శి మేష్యు, జిల్లా నాయకులు మోయిజ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.